## క్లుప్తంగా

### ఘనంగా జ్యోతుల ఉత్సవం



జ్యోతులు మోస్తున్న మహిళలు

గుడిబండ: ఫళారం గ్రామంలో వెలసిన లక్ష్మీదేవతకు గ్రామస్తులు శుక్రవారం జ్యోతుల ఉత్సవం ఘనంగా నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో మహిళలు వరలక్ష్మీ వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయాలు కిటకిటలాడాయి.

### ఎరువుల దుకాణాల తనిఖీ

రొద్దం: మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను ఏఓ నివేదిత శుక్రవారం తనిఖీ చేశారు. నాణ్యమైన ఎరువులు, విత్తనాలు విక్రయించాలన్నారు. రైతులకు విత్తనాలు, ఎరువులు విక్రయించాలన్నారు. ఎరువుల నాణ్యత పరిశీలించడానికి శాంపుల్స్ తీసి ల్యాబ్‌కు పంపనున్నట్లు ఆమె తెలిపారు.

### సూక్ష్మసేద్యంపై అవగాహన



డ్రిప్ పరికరాలను పరిశీలిస్తున్న దృశ్యం

మడకశిరరూరల్: వైబీహళ్లి పంచాయతీలో శుక్రవారం ఏపీఎంఐపీ ఆధ్వర్యంలో సూక్ష్మ సేద్యంపై రైతులకు అవగాహన కల్పించారు. ఎంఐఏఓ నరసింహులు మాట్లాడుతూ డ్రిప్, స్ప్రింక్లర్లు వాడకంతో తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో పంటసాగు చేసి మంచి దిగుబడి పొందడానికి అవకాశం ఉందన్నారు. ఆర్బీకే సిబ్బంది ఈ –క్రాప్ సమయంలో డ్రిప్,స్ప్రింకర్లు ఉంటే వాటిని కూడా నమోదు చేయాలని తెలిపారు. అర్హత ఉన్నవారు సబ్సిడీ డ్రిప్ పరికరాలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

### నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

మడకశిరరూరల్: ఎం రంగాపురం, తండా గ్రామాల్లో శనివారం ఉదయం 9 గంటలకు ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ రామలింగమ్మ, ఎంపీపీ కవిత తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

### ఎమ్మెల్యేకు సన్మానం



ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

పెనుకొండ: ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణను స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సన్మానించారు. శ్రీసత్యసాయి జిల్లా వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడిగా మాలగుండ్ల శంకరనారాయణను నియమిస్తూ పార్టీ అధిష్టానం ఆదేశాలు జారీ చేసింది. దీంతో వైఎస్సార్‌సీపీ టౌన్ కన్వీనర్ బోయ నరసింహ, మండల కన్వీనర్ నాగలూరు బాబు, నగర పంచాయితీ చైర్మన్ ఉమర్‌ఫారూక్‌ఖాన్, వైస్ చైర్మన్ సునీల్, మండల అగ్రి కమిటీ చైర్మన్ కొండలరాయుడు, జయశంకరరెడ్డి, ఫరీద్ తదితరులు ఎమ్మెల్యేను సన్మానించారు.

### అభివృద్ధి పనుల పరిశీలన

లేపాక్షి: మండలంలోని కొండూరు గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులను జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి పరిశీలించారు. గతంలో నిర్వహించిన 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం కింద డ్రైనేజీలు, సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. శుక్రవారం డ్రైనేజీ నిర్మాణానికి ఆయన భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యుడు అశ్వత్థప్ప, స్థానిక నాయకులు రాము తదితరులు పాల్గొన్నారు.

### వందశాతం అక్షరాస్యత సాధనకు కృషి చేయండి



వలంటీర్లకు అవగాహన కల్పిస్తున్న ఎంఈఓ శ్రీధర్

రొళ్ల: మండలంలో వందశాతం అక్షరాస్యత సాధనకు వలంటీర్లు కృషి చేయాలని ఎంఈఓ–2 శ్రీధర్ పేర్కొన్నారు. శుక్రవారం రత్నగిరి సచివాలయం ఆవరణలో రత్నగిరి, కాకి వార్డు వలంటీర్లకు ఈజీఈఆర్ (ఎడ్యుకేషన్ గ్రాస్ ఎన్‌రోల్మెంట్ రేషియో) సర్వేపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి పాఠశాలలో చేర్పించాలన్నారు. గ్రామాల్లో ఈజీఈఆర్ సర్వేను పకడ్బందీగా చేపట్టాలన్నారు.

# భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం

సాక్షి నెట్‌వర్క్: శ్రావణమాసం శుక్రవారం వరమహాలక్ష్మీదేవి వ్రతాన్ని మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ పండుగను పురస్కరించుకుని హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లోని వరలక్ష్మీదేవి కలశ ప్రతిమలను కొలువు దీర్చి పూజలు చేపట్టారు. అమ్మవారికి పుష్పాభిషేకాలు, కుంకుమార్చనలు చేసి వరలక్ష్మీ వ్రతాన్ని నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలిరావడంతో ఆలయాలన్నీ కిటకిటలాడాయి. ప్రతి ఇంటా ముత్తైదువులు, యువతులు లక్ష్మీదేవి కలశాలను పట్టువస్త్రాలు, బంగారు అభరణాలతో అలంకరించి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అలాగే బంధువులు, సన్నిహితులైన ముత్తైదువులను ఇళ్లకు పిలిచి వాయినాలు తీసుకున్నారు.



లేపాక్షి: అలంకరణలో దుర్గాదేవి



పెనుకొండలో వరలక్ష్మీ మాతకు ప్రత్యేక పూజలు చేస్తున్న ఆర్యవైశ్య మహిళలు



అలంకరణలో వరలక్ష్మీ అమ్మవారు



లక్ష్మీదేవి అలంకరణలో బొలికొండ గంగమ్మ



చిలమత్తూరు: కొత్తచామలపల్లిలో ఓ ఇంట్లో అలంకరణలో మహాలక్ష్మీ



శీతలాంబదేవికి పూజలు చేస్తున్న అర్చకుడు

## ఓటరు నమోదులో జాగ్రత్తలు పాటించండి

అమరాపురం: ఓటరు నమోదులో జాగ్రత్తలు పాటించాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చిన్నయ్య బీఎల్‌ఓలకు సూచించారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో బీఎల్‌ఓలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నయ్య మాట్లాడుతూ గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లినప్పుడు మరణించిన వారు, ఇతర గ్రామాలకు వెళ్లిన వారి జాబితాను సరి చూసి అన్ని వివరాలను తెలుసుకున్న తరువాత తొలగింపు లేదా నమోదు చేయాలని సూచించారు. ఓటర్ల నుంచి ఎలాంటి సమస్య వచ్చిన బీఎల్‌ఓలదే బాధ్యత అన్నారు.



బీఎల్‌ఓలకు శిక్షణ ఇస్తున్న అధికారులు

తహసీల్దార్ రమేష్‌బాబు, డీటీ గురుబ్రహ్మ, ఎంపీడీఓ మునిస్వామి, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

## లోకేష్, చంద్రబాబుపై ఫిర్యాదు



సీఐ సుబ్బరాయుడుకు ఫిర్యాదు చేస్తున్న నాయకులు



ఎస్‌ఐకు ఫిర్యాదు చేస్తున్న దృశ్యం

సోమందేపల్లి: రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా వ్యాఖ్యలు చేస్తున్న టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, ఆయన తనయుడు నారాలోకేష్‌పై వైఎస్సార్‌సీపీ సోషియల్ మీడియా విభాగం నాయకులు పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు.నాయకులు మాట్లాడుతూ 2019 నుంచి 2024 వరకు ఏ టీడీపీ కార్యకర్తపైన అయితే ఎక్కువ కేసులు ఉంటాయో వారికి ప్రాధాన్యత ఇస్తామని రెచ్చగొట్టడం సరికాదని అన్నారు. పుంగనూరు, మాచర్ల లాంటి ఘటనలే ఇందుకు నిదర్శనమని తెలిపారు. వారిపై కేసులు నమోదు చేయాలని ఎస్‌ఐ విజయ్ కుమార్‌ను కోరారు. కార్యక్రమంలో వైఎస్సాసీపీ నాయకులు శివ, ఈశ్వర్, సూర్య ప్రతాప్ రెడ్డి, నగేష్, శ్రీరాములు, ఇర్ఫాన్, అంజి, రమేష్, రామాంజి తదితరులు పాల్గొన్నారు.

### గోరంట్లలో..

గోరంట్ల: రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా వ్యాఖ్యలు, ప్రసంగాలు చేస్తున్న టీడీపీ అధినేత చంద్రబాబు, ఆయన తనయుడు లోకేష్‌పై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సోషియల్ మీడియా ప్రతినిధులు, సచివాలయ మండల కన్వీనర్ సమరసింహారెడ్డి, నాయకులు సీఐ సుబ్బరాయుడుకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. లోకేష్ యువగళం పాదయాత్రలో తెలుగుదేశం పార్టీలో ఎక్కువ కేసులు ఉన్న వారికే పదవులు ఇస్తామని రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో జిల్లా సహకార బ్యాంకు డైరెక్టర్ పాటూరి శంకరరెడ్డి, మాజీ పట్టణ కన్వీనర్ మేదర శంకర నాయకులు రంగారెడ్డి, నాగేనాయక్, లక్ష్మిరెడ్డి తదితరులు పోలీసులకు ఫిర్యాదు చేసిన వారిలో ఉన్నారు.

## ఎస్టీ రిజర్వేషన్ కోసం పోరాటాలకు సిద్ధంకండి

గోరంట్ల: ఎస్టీ రిజర్వేషన్ కోసం వాల్మీకులు పోరాటాలకు సిద్ధం కావాలని రాష్ట్ర వాల్మీకి సేవ సమితి అధ్యక్షుడు లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక టీటీడీ కళ్యాణ మండపంలో వాల్మీకి సేవ సమితి రాష్ట్ర స్థాయి సమావేశం లక్ష్మీనారాయణ (బోయ) అధ్యక్షతన జరిగింది. కార్యక్రమానికి దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన వాల్మీకి సంఘం నాయకులు హాజరయ్యారు. రాష్ట్రీయ వాల్మీకి ధర్మ సమాజ్ నేషనల్ ప్రెసిడెంట్ దిల్‌బాగ్‌టంక్ మాట్లాడుతూ దేశంలో వాల్మీకి, బోయ కులస్తులకు ఒక్కో రాష్ట్రంలో ఒక్కవిధంగా రిజర్వేషన్ అమలు అవుతోందన్నారు. స్వాతంత్రం రాక మునుకు ఆదివాసీయులైన వాల్మీకులను ఎస్టీ జాబితలో చేర్చారని, దేశ వ్యాప్తంగా వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జాతీయ నాయకులు అశోక్ మల్హోత్ర, అకాష్ రాజ్, రాష్ట్ర నాయకులు సోముశేఖర్, జిల్లా నాయకులు, మండల నాయకులు పాల్గొన్నారు.



గోరంట్లలో నిర్వహించిన వాల్మీకి రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర స్థాయి సమావేశంలో పాల్గొన్న జాతీయ నాయకులు

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హిందూపురం అర్బన్: హిందూపురం విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలోని కొట్నూరు, మనే సముద్రం, రాచపల్లి సబ్ స్టేషన్‌ల కింద గ్రామాల్లో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం కరెంట్ సరఫరా నిలిపివేస్తామని ఏఈఈ మహేష్‌కుమార్ శుక్రవారం తెలిపారు. ఆయా సబ్ స్టేషన్‌ల పరిధిలోని ముద్దిరెడ్డిపల్లి, సింగరెడ్డిపల్లి, కొల్లకుంట, కొట్నూరు, చిన్నగుడ్డంపల్లి, పెద్దగుడ్డంపల్లి, నందమూరి నగర్, మనేసముద్రం, మలగూరు, ఊటుకూరు,గొల్లపల్లి, ఎర్రగుంట్ల, చలివెందుల ,మీనకుంటపల్లి, రాచపల్లి, బాలంపల్లి, జంగాలపల్లి, చెర్లోపల్లి, పత్తికుంటపల్లి, వెడదకల, తుంగోడు, కొలింపల్లి, నాగేపల్లి, మానేపల్లి గ్రామాలకు శనివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

### వార్డు సచివాలయం తనిఖీ

మడకశిర: పట్టణంలోని ఎస్సీ కాలనీ వార్డు సచివాలయాన్ని శుక్రవారం మున్సిపల్ కమిషనర్ ప్రభాకర్‌రావు తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. సమస్యలపై వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.



సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్ ప్రభాకర్‌రావు

### కరుణించు వరుణదేవా

అగళి: కొమరేపల్లి గ్రామంలో శుక్రవారం సాయంత్రం వర్షాలు కురవాలని కోరుతూ పిల్లలతో మండ్రాయ దేవుడిని ఊరేగించారు. ఇలా చేస్తే వర్షాలు కురుస్తాయని గ్రామస్తుల నమ్మకం.

### ఊరికొక బడి, గుడి నిర్మించండి

పావగడ: మను కులం అభివృద్ధికి ప్రతి ఊరులో బడి, గుడి నిర్మించాలని హొసదుర్గ కనక గురు పీఠాధ్యక్షుడు ఈశ్వరానంద స్వామి జీ పిలుపు నిచ్చారు. తాలూకాలోని వెంకటాపురంలో నూతనంగా నిర్మించిన ఆళ్ల బీరలింగేశ్వర స్వామి ఆలయ ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడారు. భక్తులు తమ ఆరాధ్య దేవుళ్ల ఆలయ, పాఠశాలల నిర్మాణానికి ఉదారంగా విరాళాలు ఇవ్వాలన్నారు. ఆలయ సమితి డైరెక్టర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### యువతకు ఉచిత శిక్షణ

పెనుకొండ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉన్నతి పథకం ద్వారా ఉపాధి పథకంలో 100 రోజులు పూర్తి చేసిన కుటుంబాల్లోని నిరుద్యోగ యువతకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు జాబ్స్ కోఆర్డినేటర్ లక్ష్మి శుక్రవారం తెలిపారు. శిక్షణకు హాజరయ్యే వారికి రోజుకు రూ. 270 స్టైఫండ్ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ సమయంలో భోజన వసతి ఉంటుందన్నారు. అనంతరం నగరాల్లో రూ. 15 వేల నుంచి రూ.25 వేల జీతం అందేలా ఉద్యోగం కల్పించనున్నట్లు తెలిపారు. 18 నుంచి 26 ఏళ్ల వయసున్న ఇంటర్, డిగ్రీ ఆపై చదువుకున్న వారు అర్హులన్నారు. వివరాలకు 7989479371 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

### సీఎం జగన్‌తోనే రైతు సంక్షేమం



మాట్లాడుతున్న వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ రమణారెడ్డి

హిందూపురం అర్బన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రైతు సంక్షేమం సాధ్యమని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని రాచపల్లిలో పంటలు సాగు చేసిన రైతుల పొలాల్లో ఈ-పంట బయోఫెన్సింగ్ సిస్టమ్‌లో నమోదు ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రైతులకు ఇబ్బందులు ఎదురు కాకుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, పంట సాగు నమోదు పారదర్శకంగా చేపట్టాలన్నారు. ప్రకృతి వైపరిత్యాలతో పంట నష్ట పోతే బీమా ప్రీమియంతో సంబంధం లేకుండానే రైతును ఆదుకుంటామన్నారు. ఏఓ అల్తాఫ్ ఆలీఖాన్ మాట్లాడుతూ రైతులు పంటల నమోదు తప్పని సరిగా చేయించుకోవాలన్నారు. వ్యవసాయ అధికారి సురేంద్ర నాయక్, విస్తరణ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

### సమస్యలు పరిష్కరించాలి

చిలమత్తూరు: పంచాయతీ పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మెలో భాగంగా రెండో రోజు కార్మికులు ఎంపీడీఓ కార్యాలయం నుంచి డప్పులు కొడుతూ నిరసన తెలిపారు..జీతాల చెల్లింపు, పెంపు, ఉద్యోగ భద్రత వంటి సమస్యలు పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.

### రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్

పరిగి: మండలంలో శుక్రవారం సెబ్ అధికారులు, పరిగి పోలీసులు రెండు ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేశారు. అక్రమంగా ఇసుక తరలిస్తుండగా దాడులు చేసి, పట్టుకున్నట్లు ఎస్‌ఐ నరేంద్ర తెలిపారు.

# టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక



మంత్రి పెద్దిరెడ్డి, సమన్వయకర్త దీపిక సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరుతున్న చలివెందుల రవీంద్రరెడ్డి



కొండూరు వేణుగోపాల్‌రెడ్డి ఇంట్లో తేనీటి విందులో పాల్గొన్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ నవీన్‌నిశ్చల్ స్వగృహంలో తేనీటి విందులో పాల్గొన్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

హిందూపురం: నియోజకవర్గంలో టీడీపీ నుంచి పలువురు నాయకులు, కార్యకర్తలు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త టిఎన్.దీపిక, నాయకుడు వేణురెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. శుక్రవారం వైఎస్సార్‌సీపీ కార్యాలయం ప్రారంభోత్సవానికి విచ్చేసిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపి గోరంట్ల మాధవ్ సమక్షంలో చలివెందుల పంచాయతీ ఎన్నికల్లో ఓటమి పాలైన టీడీపీ నాయకులు రవీంద్రరెడ్డితోపాటు సుమారు 40మంది వైఎస్సార్‌సీపీలో చేరారు. అలాగే వైఎస్సార్‌సీపీ నాయకులు వాల్మీకి సుభాష్ ఆధ్వర్యంలో 7వ వార్డులోని తిప్పరాజు, సంజీవ, శ్రీనివాసరెడ్డితోపాటు 50 మంది, 8వవార్డు కౌన్సిలర్ గిరిష్, నాయకులు రవీంద్రుడు ఆధ్వర్యంలో రామాంజనేయులు, సుభాష్, ఉల్కలప్పతోపాటు 30 మంది, బోయపేట టీడీపీ నాయకులు శ్రీనివాసులు, పీజీ నాగరాజు, 31వ వార్డు నాయకుడు సీఎస్‌పీ నాగరాజు ఆధ్వర్యంలో పలనీనగర్ నుంచి 80 మంది వైఎస్సార్‌సీపీలో చేరారు. మణేసముద్రంలోని లక్ష్మీనారాయణతోపాటు 30 కుటుంబాలు, బీరేపల్లి పంచాయతీలో టీడీపీ నాయకుడు తిమ్మిరెడ్డి, మరో 20 కుటుంబాల నాయకులు, చిలమత్తూరులోని వాల్మీకి హరి, రాజుతోపాటు 50 మంది, గోలాపురం నుంచి వైఎస్సార్‌సీపీ సర్పంచ్ దేవరాజు, వైస్ ఎంపీపీ రామాంజి, నాయకులు తిప్పేరుద్రయ్య ఆధ్వర్యంలో టీడీపీ మాజీ ఎంపీటీసీ శ్రీనివాసులుతోపాటు 30 మంది పార్టీలో చేరారు.

**మంత్రితో నాయకుల భేటీ**

హిందూపురం టౌన్: వైఎస్సార్‌సీపీ కార్యాలయం ప్రారంభోత్సవానికి విచ్చేసిన ఆ పార్టీ రాయలసీమ కోఆర్డినేటర్, రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పట్టణంలో పలువురు నాయకుల ఇళ్లకు నాయకులు, కార్యకర్తలతో ముచ్చటించారు. కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ముగించుకుని వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత కొండూరు వేణుగోపాల్‌రెడ్డి ఆహ్వానం మేరకు ఆయన ఇంటికి తేనీటి విందు స్వీకరించి నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. అలాగే రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ నవీన్‌నిశ్చల్ ఇంటికి వెళ్లిన మంత్రిని పలువురు ఆర్యవైశ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు కలిశారు. అలాగే మున్సిపల్ వైస్ చైర్మన్ బలరామిరెడ్డి ఆహ్వానం మేరకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆయన ఇంటికి వెళ్లి ఆతిథ్యాన్ని స్వీకరించారు. లైఫ్ వరల్డ్ చారిటబుల్ ట్రస్ట్ ఉదయ్‌కుమార్ ఇంటికి వెళ్లిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని పాస్టర్లు కలిశారు. హిందూపురంలో క్రైస్తవుల కోసం శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. అలాగే పలువురు మంత్రిని కలిసి వినతిపత్రాలను అందజేశారు.

**మంత్రి పెద్దిరెడ్డిని కలిసిన పార్టీ శ్రేణులు**

పరిగి: శ్రీసత్యసాయి జిల్లా పర్యటనకు శుక్రవారం వచ్చిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణను పరిగి మండల వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, పార్టీ అభిమానులు ధనాపురం క్రాస్ వద్ద మర్యాదపూర్వకంగా కలిశారు. ఈమేరకు మడకశిరలో వైసీ తిమ్మారెడ్డి విగ్రహావిష్కరణలో పాల్గొని, తిరుగు ప్రయాణంలో హిందూపురానికి వెళ్తున్న మంత్రిని కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు. మంత్రి మాట్లాడుతూ రానున్న ఎన్నికల దృష్ట్యా పార్టీ పటిష్టతకు అందరూ కలిసికట్టుగా పని చేయాలని సూచించారు. రాబోవు ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయకేతనాన్ని ఎగరవేయడంలో అందరి సమష్టి కృషి ఉండాలన్నారు. మంత్రిని కలిసిన వారిలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహమూర్తి, సచివాలయ మండల కన్వీనర్ గంగాధర్‌రెడ్డి, సర్పంచ్‌లు మంజునాథ్‌రెడ్డి, బాలకృష్ణ, దిలీప్, ఎంపీటీసీలు మారుతీరెడ్డి, చిక్కన్న, నాయకులు శివశంకర్, సురేష్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రభాకర్, రామాంజి, ఐటీ వింగ్ షబ్బీర్, మాజీ ఎంపీటీసీ అంజి తదితరులు ఉన్నారు.

**మాజీ ఎమ్మెల్యే గృహ ప్రవేశానికి హాజరైన మంత్రి పెద్దిరెడ్డి**

మడకశిర: పట్టణంలో శుక్రవారం మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్‌రెడ్డి నూతన గృహ ప్రవేశం జరిగింది. కార్యక్రమానికి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యే తిప్పేస్వామి, టీటీడీ బోర్డు మెంబర్ అశోక్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రికి మాజీ ఎమ్మెల్యే వైటీ కుటుంబసభ్యులు స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. సత్యనారాయణస్వామి తీర్థ ప్రసాదాన్ని మంత్రికి అందించారు. వైటీ ప్రభాకర్‌రెడ్డి సతీమణి డాక్టర్ ఉషారాణి, కుమార్తె డాక్టర్ అరవింద ఉన్నారు. ఇదిలా ఉండగా పట్టణంలోని ఎమ్మెల్యే తిప్పేస్వామి, వైఎస్సార్‌సీపీ నాయకులు వైసీ గోవర్ధన్‌రెడ్డి, రవిశేఖర్‌రెడ్డి, లక్ష్మీనరసింహారెడ్డి ఇళ్లకు మంత్రి వెళ్లారు. మంత్రి మడకశిరకు వచ్చిన సందర్భంగా మధుగిరి సర్కిల్‌లో ఎమ్మెల్యే తిప్పేస్వామి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు.

**ప్రొఫెషనల్ కమ్యూనికేషన్ ల్యాబ్‌ను ప్రారంభించిన మంత్రి**

హిందూపురం టౌన్: పట్టణంలోని ఎస్‌డీజీఎస్ కళాశాలలో ప్రొఫెషనల్ కమ్యూనికేషన్ ల్యాబ్‌ను రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్స్ గార్డ్ ఆఫ్ హానర్, సెరిమోనియల్ సెల్యూట్‌ను స్వీకరించారు. కళాశాల ప్రాంగణంలోని వాసవీ మాతకు పూలమాలను వేసి.. మొక్కలను నాటారు. అనంతరం కళాశాలలో మంత్రి ఆర్యవైశ్యులతో సమావేశమయ్యారు. పట్టణంలో శాంతిభద్రతలు కాపాడి వ్యాపారులకు ఇబ్బంది కలగకుండా చూస్తామన్నారు. వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక, కళాశాల కమిటీ అధ్యక్షుడు చంద్రమోహన్, సభ్యులు, విద్యార్థులు, మండి మర్చంట్ అసోసియేషన్స్, ఆర్యవైశ్య సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

**మంత్రికి స్వాగతం పలికిన ఎమ్మెల్యే**

పెనుకొండ: రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి శ్రీసత్యసాయి జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ ఘన స్వాగతం పలికారు. జిల్లా పర్యటనలో భాగంగా శుక్రవారం హిందూపురంలో జరిగిన వైఎస్సార్ సీపి సమావేశానికి మంత్రి హాజరయ్యారు. మంత్రిని లేపాక్షి వద్ద కలసిన ఎమ్మెల్యే..ఆయనకు బొకే అందించి, సత్కరించారు.

## విధులు సమర్థవంతంగా నిర్వహించండి

హిందూపురం అర్బన్: సమయపాలన పాటించి విధులను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గిరిజమ్మ మండల పరిషత్ కార్యాలయ సిబ్బందిని ఆదేశించారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయాన్ని శుక్రవారం ఆమె తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. మండల పరిషత్ నిధులతో కార్యాలయ మరమ్మతులు చేయించేందుకు జెడ్పీటీసీ నాగభూషణం అనుమతి కోరగా ఆమె సానుకూలంగా స్పందించి నిదులు మంజూరు చేయాలని ఎంపీడీఓ నరేంద్రకుమార్‌కు సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ రత్నమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

### తప్పుడు కేసు నమోదు చేశారని ఫిర్యాదు

పెనుకొండ: తాను మద్యం సేవించి భర్త మన్సూర్‌తో కలిసి ఘర్షణకు దిగినట్లు ఎస్‌ఐ రమేష్‌బాబు తప్పుడు కేసు నమోదు చేశారని పట్టణానికి చెందిన గాయత్రి అనే మహిళ వాపోయింది. శుక్రవారం ఆమె మాట్లాడుతూ 2022 ఫిబ్రవరి 26న రాత్రి తన భర్త మన్సూర్ తోటగేరిలో నివాసం ఉంటున్న వెంకటేష్ ఘర్షణ పడ్డారని, అయితే ఇందులో తనకు ఎలాంటి సంబంధం లేదన్నారు. అయితే భర్తతో కలసి తాను మద్యం సేవించి వెంకటేష్‌తో గొడవకు దిగినట్లు కేసు నమోదు చేశారని, ఇందులో ఎలాంటి వాస్తవం లేదన్నారు.ఈ విషయమై ఎస్‌ఐ మాట్లాడుతూ బాధితుడు వెంకటేష్ ఫిర్యాదు మేరకే తాము కేసు నమోదు చేశామన్నారు.

### పేర్లు నమోదు చేసుకోండి

మడకశిరరూరల్: ప్రభుత్వం 80 శాతం సబ్సిడీతో అందిస్తున్న ఉలవలకు రైతు భరోసా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని ఏఓ తిమ్మప్ప శుక్రవారం తెలిపారు. సబ్సిడీ పోనూ 10 కేజీల ఉలవలకు రైతు కేవలం రూ.216 చెల్లించాల్సి ఉంటుందన్నారు. రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయాధికారి సూచించారు.